సాక్షి తిరుపతి

సోమవారం । 31 । మార్చి । 2025



రెండు బస్సుల ఢీ

తడ బస్టాండ్ వద్ద ఆదివారం ఉదయం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును తమిళనాడుకు చెందిన బస్సు వెనుక నుంచి ఢీకొంది. - 8లో



శుభకరం..'విశ్వావసు' సంవత్సరం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు. - 8లో



లక్ష కుంకుమార్చన

సూళ్లూరుపేట : చెంగాళమ్మ ఆలయంలో ఆదివారం ఉగాది సందర్భంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

కన్నప్పకు సారె సమర్పణ



సారె అందిస్తున్న ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి : పట్టణంలోని తేరువీధిలో వెలసిన భక్తకన్నప్ప ఆలయ 45వ వార్షికోత్సవం సందర్భంగా ముక్కంటి ఆలయం తరపున శాస్త్రోక్తంగా సారె సమర్పించారు. ఈ క్రమంలో తొలుత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తకన్నప్ప ఆలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ఎల్లమ్మ



ఊరేగుతున్న అమ్మవారు

చంద్రగిరి : గ్రామ దేవత మూలస్థాన ఎల్లమ్మతల్లి ఆదివారం అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉగాదిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి అశ్వవాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో గ్రామోత్సవం జరిపించారు. పాకాల వంశస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు పాకాల చంద్రశేఖర్ రెడ్డి, పాకాల సతీష్ రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్, మహేందర్, చేతన్ కుమార్‌రెడ్డి, చిన్ని, శరత్ కుమార్ రెడ్డి, పాకాల చరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గణపతికి వెండి కవచాల సమర్పణ



వెండి కవచాలను అందిస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని కోష్ట గణపతికి హైదరాబాద్‌కు చెందిన దాతలు జి.హరికృష్ణ, రాధిక సుమారు రూ.7లక్షల విలువైన 7 కేజీల వెండి కవచాలను సమర్పించారు. ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డికి అందించారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో బోర్డు అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కోష్ట గణపతికి వెండి కవచం వితరణ చేయాలని దాతను కోరినట్లు వెల్లడించారు. కాణిపాకం ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సుమశోభితం



విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని విశేష పుష్పాలంకరణలో శోభాయమానంగా దర్శనమిస్తున్న తిరుమల శ్రీవారి ఆలయం

వైభవం.. ఉగాది ఉత్సవం



తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో సాక్షి మీడియా వారు చేపట్టిన ఉగాది ఉత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించింది. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు ప్రదానం చేసింది. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా వేడుక పరిపూర్ణమైంది. - 8లో

గంగ.. తీరని బెంగ!

దేశానికి వెన్నెముకగా చెప్పుకునే రైతులకు మేలు చేయాలనే సత్సంకల్పం పాలకులకు ఉండాలి.. వ్యవసాయానికి సమృద్ధిగా సాగునీరు అందించాలనే పట్టుదల ఉండాలి.. అన్నదాతకు అండగా నిలవాలనే ఉదార స్వభావం ఉండాలి. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం ఏమాత్రం చిత్తశుద్ధిని చూపించడం లేదు. రైతాంగంపై కనీస కనికరం ప్రదర్శించడం లేదు. ఇందుకు తెలుగు గంగ బ్రాంచ్ కెనాల్స్ దుస్థితే నిదర్శనంగా కనిపిస్తోంది. వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేయగల కాలువలను అసంపూర్తిగా వదిలేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

సూళ్లూరుపేట మండలం మంగళంపాడు వద్ద బ్రాంచ్ కెనాల్ దుస్థితి



అసంపూర్తిగా తెలుగుగంగ బ్రాంచ్ కెనాల్స్

- బడ్జెట్‌లో పైసా కేటాయించని కూటమి ప్రభుత్వం
- 1999 నుంచి సా..గి ఆగిపోయిన పనులు
- ఏమాత్రం పట్టించుకోని టీడీపీ నేతలు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుగంగ బ్రాంచ్ కెనాల్స్ అసంపూర్తిగా మిగిలిపోయాయి. రైతులకు ఎంతో ఉపయోగకరమైన వీటిని నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం ఒక్క పైసా కేటాయించిన దాఖలాల్లేవు. దీంతో ఆయా ప్రాంతాల్లో కేవలం వర్షాధారంతోనే వ్యవసాయం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

వ్యవసాయ అవసరాలంటే చిన్నచూపా?

పారిశ్రామిక వాడలు, వంద అడుగులు రోడ్లు వేయడానికి, ప్రస్తుతం కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కూడా అటవీశాఖ భూములను తీసిచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రనాయుడు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అదే రైతులకు సాగునీటి అవసరాలు తీర్చే కాలువల నిర్మాణానికి మాత్రం అటవీశాఖ క్లియరెన్సులు ఇప్పించే దిశగా యత్నించడం లేదు. వ్యవసాయ అవసరాలంటే ప్రభుత్వానికి ఇంత చిన్నచూపా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

ప్రారంభించి.. చేతులు దులిపేసుకుని

తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరు ఇవ్వాలనే ఆలోచనతో 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వమే 5 బ్రాంచి కాలువలను తవ్వించేందుకు సిద్ధమైంది. మాజీ ఎమ్మెల్యే పసల పెంచలయ్య ఆందోళనకు స్పందించిన నాటి ఇరిగేషన్ మంత్రి మండవ వెంకటేశ్వర రావు, అప్పటి జిల్లా మంత్రులు పరసా వెంకటరత్నయ్య, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆఘమేఘాల మీద ఎన్నికల స్టంట్ కోసం బ్రాంచి కెనాల్స్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. 1999–2004 వరకు టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ ఈ కాలువలను పట్టించుకోలేదు. 2004లో అధికారంలోకి వచ్చిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఈ కాలువల పనులకు శ్రీకారం చుట్టి కొంతమేర పనులు చేయించారు.. 2014లో మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో తెలుగుగంగ బ్రాంచ్ కెనాల్స్ ఊసే ఎత్తలేదు. ఆ పార్టీ స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు సైతం ఆ పేరు కూడా పలకలేదు. ప్రస్తుతం కూటమి సర్కారు హయాంలో అయినా తెలుగు గంగ బ్రాంచ్ కెనాల్స్ నిర్మాణం మొదలవుతుందా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే టీడీపీ నేతలు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. కాలువలే నిర్మించలేని వారు నదుల అనుసంధానం అంటూ ఆర్భాటపు ప్రకటనలు గుప్పిస్తున్నారంటూ మండిపడుతున్నారు.

అన్ని కాలువలు అరకొరగానే..




దొరవారిసత్రం మండలం నేలపట్టు వద్ద అసంపూర్తిగా 14ఆర్ బ్రాంచ్ కాలువ

పెళ్లకూరు, దొరవారిసత్రం, చిట్టమూరు, వాకాడు మండలాలకు సాగునీరు అందించే 7వ నంబర్ కాలువ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ కాలువ నుంచి సూళ్లూరుపేట మండలం తూర్పు వైపు పల్లెలకు, పడమర వైపు పల్లెలకు సాగునీటిని అందించేందుకు 14ఎల్, 14ఆర్ చిన్నపాటి కాలువల నిర్మాణం చేయాల్సి ఉంది. ఇందులో 14ఆర్ కాలువ పనులు మాత్రం అరకొరగా జరుగుతున్నాయి. దీనికి అటవీశాఖ భూములు అవసరమవడంతో వారి నుంచి క్లియరెన్స్ లేక ఇది కూడా ఆగిపోయింది. ఆరో నంబర్ కాలువ ఓజిలి మండలం, కోట మండలానికి సాగునీరు అందించే విధంగా రూపొందించారు. 8వ నంబర్ కాలువ సూళ్లూరుపేట మండలంలోని పడమర వైపు పల్లెలకు, 8బీ కాలువ తడ మండలంలోని ఉత్తరం వైపు గ్రామాలకు, 9 నంబరు కాలువ తడ మండలం దక్షిణం వైపు పల్లెలతో పాటు సత్యవేడు మండలంలోని కొన్ని గ్రామాలకు సాగునీరు అందించేలా డిజైన్ చేశారు. అయితే కాలువలన్నీ కూడా ప్రస్తుతం ఆగిపోయి ఉన్నాయి. ఇదంతా చంద్రబాబు నిర్వాకమే కాబట్టి ఈ సారైనా పనులు పూర్తి చేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీటి సౌకర్యం కల్పిస్తారా! అనే విషయం అనుమానంగానే వుంది.

చెరువులకు నీరేది?

సూళ్లూరుపేట నియోజకవర్గంలో 402 మేజర్, మైనర్ చెరువులున్నాయి. ఈ చెరువుల కింద సుమారుగా 28,431 హెక్టార్ల ఆయకట్టు వుంది. రబీ సీజన్‌లో 27,747 హెక్టార్లులో, ఖరీఫ్‌లో మరో అయిదు వేల హెక్టార్లులో వరి సాగు చేస్తున్నారు. బోర్లు, బావుల కింద వరి, వేరుశనగ, సజ్జ, రాగితో పలు రకాల కూరగాయలు పంటలు కూడా పండిస్తున్నారు. తెలుగుగంగ ప్రధాన కాలువకు నీరు వదిలినప్పుడే కొన్ని చెరువులకు దొంగ దారుల గుండా రైతులే తెచ్చుకోవాల్సి వస్తోంది. తెలుగుగంగ బ్రాంచ్ కాలువలను పూర్తి చేయడానికి కోట్లాది రూపాయల నిధులు అవసరమున్నప్పటికీ బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదు. కనీసం ఇప్పటికే ఉన్న సాగునీటి కాలువలనైనా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తున్నారా అంటే అదీ లేదు. గతంలో నీరు–చెట్టు, పనికి ఆహార పథకం కింద ఎందుకు పనికి రాని పనులు చేసి కోట్లాది రూపాయలను తెలుగు తమ్ముళ్లు తమ జేబులో వేసుకున్నారు.



కష్టంగా ఉంది

ఎన్నికల సమయంలో ఉత్తుత్తి మాటలు చెప్పి గెలిచిన తర్వాతత పట్టించుకోవడం లేదు. తెలుగుగంగ బ్రాంచ్ కెనాల్స్ గురించి గడిచిన 30 ఏళ్ల నుంచి చెబుతున్నారు. అవి పూర్తయింది లేదు. దొంగతనంగా నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితులే ఇప్పటికీ ఉన్నాయి. బడ్జెట్‌లో నిధులు కేటాయింపు లేకపోవడంతో కాలువల ఊసే లేకుండా పోయింది. ఈ కాలువలు పూర్తి చేస్తే రైతులు బాగుపడతారు. ప్రస్తుతం ఒక పంట పడించుకోవడమే కష్టంగా ఉంది. – గాలి మల్లికార్జున్‌రెడ్డి, రైతు, సుగ్గుపల్లి

అధికారికంగా నీరివ్వాలి

సూళ్లూరుపేట మండలానికి తెలుగుగంగ నీరు అందించే కాలువలు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. వీటిని గతంలో టీడీపీ వారే తీసుకుచ్చారు. తర్వాత సుమారు 20 ఏళ్ల పాటు వారే ఈ రాష్ట్రాన్ని పాలించారు. రైతులకు సాగునీరు అందించే కాలువల విషయంలో మాత్రం నానుస్తూనే వున్నాయి. తెలుగుగంగ ప్రధాన కాలువకు నీరు వదిలినపుడు వాగుల గుండా, వంకలగుండా పారించుకుంటున్నాం. కాలువలను పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేయించి అధికారికంగా నీరివ్వాల్సిన అవసరముంది.

– దామతోటి లక్ష్మయ్య, రైతు, వెలగల పొన్నూరు

ఘనంగా ఉగాది సంబరం



విజేతలతో అతిథులు, అధికారులు

- తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో అధికారికంగా నిర్వహణ
- పురస్కారాలు ప్రదానం చేసిన జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ప్రభుత్వం తరపున అధికారికంగా ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ అనంతరం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలు ప్రారంభించారు. ఈ క్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం వేదిక్ వర్సిటీ ఆచార్యులు భావనారాయణాచార్యులు నేతృత్వంలో విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేపట్టారు. జేసీ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలు వారసత్వానికి చిహ్నాలుగా అభివర్ణించారు. మన మూలాలను ఎప్పటికీ గుర్తు పెట్టుకుని నడుచుకోవాలని సూచించారు. ఉగాది పచ్చడి షడ్రుచులు జీవితంలో అన్ని భావాల సమ్మిళితం చేస్తాయని వివరించారు. జిల్లాలోని ప్రజలు అందరికీ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు కలగాలని, ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అతిథులు, సభికులు ఉగాది పచ్చడి సేవించారు.

బహుమతుల ప్రదానం

వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జేసీతో పాటు డీఆర్‌ఓ నరసింహులు, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, టూరిజం అధికారి జనార్ధన్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

10 మందికి పురస్కారాలు

వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరచిన పది మందికి ఉగాది పురస్కారాలు అందజేశారు. సాహిత్య రంగం నుంచి డాక్టర్ వి.కృష్ణవేణి, సంగీత రంగం నుంచి ఎం.సుధాకర్, అవధానం కేటగిరీలో ఉప్పుదడియం భరత్ శర్మ, వాయిద్యంలో డాక్టర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ టి.భారతి, డాక్టర్ ఉషా కళావత్, సామాజిక సేవ నుంచి డాక్టర్ పైడి అంకయ్య, రాష్ట్రీయ సేవా సమితి, జి.బాలకృష్ణారెడ్డి, పర్యావరణ పరిరక్షణ రంగం నుంచి పాలేటి శివాజీకి అవార్డులు అందించి సత్కరించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 76,005 మంది స్వామివారిని దర్శించుకోగా 22,686 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.8 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేటి గ్రీవెన్స్ రద్దు

తిరుపతి అర్బన్ : రంజాన్ పండుగ నేపథ్యంలో సోమవారం గ్రీవెన్స్ డే రద్దు చేశారు. ప్రభుత్వ సెలవు రోజు కావడంతో కలెక్టరేట్‌తోపాటు ఆర్‌డీఓ ,తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం లేదని అధికారులు ప్రకటించారు.

ఏపీఐసీసీ భూముల నుంచి మట్టి తరలింపు



జేసీబీతో మట్టిని తవ్వి ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు గ్రామంలో వున్న ఏపీఐసీసీ భూముల నుంచి మట్టిని శ్రీనిధి రాజా ఫ్యాక్టరీ యాజమాన్యం తరలిస్తోంది. దీన్ని ఆదివారం సర్పంచ్ చంద్రారెడ్డి, గ్రామస్తులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ శ్రీనిధి రాజా ఫ్యాక్టరీ యాజమాన్యం ఏపీఐసీసీ భూముల్లోని మట్టిని జేసీబీతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా విచ్చలవిడిగా తరలిస్తోందన్నారు. దీనిపై ఏపీఐసీసీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మట్టిని తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను అడ్డుకుని, ఏపీఐసీసీ అధికారులకు అప్పగించారు. అధికారులు స్పందించి ఏపీఐసీసీ భూముల్లోని మట్టిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రామం..సర్వభూపాలం



ఊరేగుతున్న కోదండరామస్వామి



వాహన సేవలో కళాకారుల నృత్య ప్రదర్శన

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం రాత్రి శ్రీరామచంద్రమూర్తి సర్వభూపాల వాహనంపై విహరించారు. గజరాజులు ముందు కదులుతుండగా, భక్త బృందాల భజనలు, మంగళవాయిద్యాల నడుమ వాహన సేవ కనులపండువగా సాగింది. అనంతరం ఆలయంలో 10.30 నుంచి 11.30 గంటల వరకు ఉత్సవ మూర్తులకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. ఈ క్రమంలోనే ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

పుష్పపల్లకీపై సిరులతల్లి విహారం



ఊరేగుతున్న శ్రీవారి దేవేరి

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం పుష్పపల్లకిపై అమ్మవారిని కొలువు దీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 8 నుంచి 8.30 గంటల వరకు పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, ఏఈఓ దేవ రాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుభాష్, అర్చకుడు బాబు స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి


మృతి చెందిన రవీంద్ర

కలువాయి(సైదాపురం) : ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన కలువాయి మండలం లలితానగర్‌లో ఆదివారం జరిగింది. వివరాలు.. కొలవనాయుడుపల్లెకు చెందిన పారి రవీంద్ర ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ధాన్యం లోడుతో ట్రాక్టర్‌లో వస్తుండగా పంది అడ్డుపడింది. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడుతుండగా అందులో నుంచి రవీంద్ర దూకేశాడు. అయితే ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైర్ల కింద పడిపోవడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బస్సుల ఢీ

– 8 మందికి గాయాలు

తడ: జాతీయ రహదారిపై తడ బస్‌స్టాండ్ వద్ద ఆదివారం ముందున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వచ్చిన తమిళనాడు ఆర్‌టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఎస్‌ఐ కొండపనాయుడు కథనం మేరకు.. 30 మంది ప్రయాణికులతో కనిగిరి నుంచి చెన్నై వెళుతున్న ఆర్టీసీ బస్సు తడలో నిలిచింది. అదే సమయంలో 23 మందితో తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న తమిళనాడు ఆర్‌టీసీ బస్సు ఢీకొంది. తమిళనాడు బస్సు డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. క్షతగాత్రులను 108లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలపై దాడి

సైదాపురం : మండలంలోని తూర్పుపూండ్ల గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురు పందెంరాయుళ్లను అరెస్ట్ చేశారు. 3 కోళ్లు, రూ.3,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

టపాకాయ పేలి బాలుడికి గాయాలు

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలం గిరిజన కాలనీలో టపాకాయ పేలి ఓ బాలుడు గాయపడిన ఘటన ఆదివారం జరిగింది. వివరాలు.. వేకువజామున మంచు అధికంగా కురుస్తుండడంతో స్థానికులు చెత్తాచెదారాలను పోగేసి చలి మంట వేసుకున్నారు. అదే సమయంలో కాలనీకి చెందిన ఆదెయ్య, సుబ్బమ్మ దంపతుల కుమారుడు ఆదెయ్య అక్కడకు వచ్చాడు. ఈ క్రమంలో చెత్తలో ఉన్న టపాకాయ పేలడంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. తల్లిదండ్రులు వెంటనే చికిత్స నిమిత్తం 108లో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


గాయపడిన ఆదెయ్య

వైభవం.. ఉగాది ఉత్సవం


పంచాంగం పఠిస్తున్న రంగ రామానుజాచార్యులు


ఉగాది విశిష్టతను వివరిస్తున్న శతావధాని భరత్ శర్మ


ప్రణవాలయ పాహీ పాటకు నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు


ఉగాది పచ్చడి


చిన్నారి శివతాండవం

- సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో 'విశ్వావసు' వేడుకలు
- ఆకట్టుకున్న విద్యార్థుల తెలుగు పద్య, గద్య పోటీలు
- కనువిందు చేసిన సంప్రదాయ వస్త్ర ప్రదర్శన
- విజేతలకు బహుమతుల ప్రదానం
- శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం
- ఈ ఏడాది ఒడిదుడుకులు తప్పవంటున్న పండితులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, చిత్రంలో సాక్షి సిబ్బంది

తిరుపతి తుడా/తిరుపతి సిటీ : సాక్షి మీడియా ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. ఆదివారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా వైభవంగా జరిపించారు. ఏబీ ఎలక్ట్రానిక్స్, అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్, అన్నమాచార్య వర్సిటీ, శుభమస్తు షాపింగ్ మాల్, కెనరా బ్యాంక్ సంయుక్త సహకారంతో సాక్షి ఉగాది ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉగాది విశిష్టత చాటేలా ఆడిటోరియాన్ని అరటి మొక్కలు, మామిడి ఆకుల తోరణాలతో అలంకరించారు. వీక్షకులను ఆహ్వానించేందుకు వివిధ పూల మొక్కలతో విశేష అలంకరణ చేశారు. వాగ్దేవి, పి.బాలచంద్ర కార్యక్రమానికి యాంకర్లుగా వ్యవహరించారు.

గణపతి పూజతో ప్రారంభం

గణపతి పూజతో సాక్షి ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమానికి పండితులు మహేష్ స్వామి శ్రీకారం చుట్టారు. సాక్షి జనరల్ మేనేజర్ బొమ్మారెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన స్పాన్సర్లు ఏబీ ఎలక్ట్రానిక్స్ అధినేతలు మహేష్, మహేంద్ర, అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత అనిత్ కుమార్ రెడ్డి, కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ పాండురంగ మితంతాయాతో పాటు శుభమస్తు షాపింగ్ మాల్ ప్రతినిధి రవి, అన్నమాచార్యా వర్సిటీ వ్యవస్థాపకుడు గంగిరెడ్డి జ్యోతి ప్రజ్వల చేసి ఉత్సవాలను ప్రారంభించారు.

ఆకట్టుకున్న పోటీలు

ఉగాది ఉత్సవాలలో భాగంగా పద్య, గద్య, సాహిత్య పోటీలను నిర్వహించగా నగరంలోని పలు విద్యాసంస్థల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. తమదైన శైలిలో గీతం, రత్నం, శ్రీ వెంకటేశ్వర, విశ్వం, అకార్డ్, విశ్వ చైతన్య, అకడమిక్ హైట్స్, ఎమ్ఎస్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్, స్ప్రింగ్ డేల్‌తో పాటు పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. చక్కని తెలుగు వచనాలు, వినసొంపైన శ్లోకాలు, వాటి భావాలను చక్కగా వివరించారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కౌశిక్, క్రిష్ణసాత్విక్, యువరాజ్ గెలుచుకున్నారు. అలాగే మరో ఐదు మందికి ముఖ్యఅతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలతో పాటు ప్రత్యేక బహుమతులు అందజేశారు.

తెలుగు గొప్పతనం చాటి చెప్పే పండుగ

ఉగాది పర్వదినం తెలుగు గొప్పతనాన్ని చాటి చెప్పే గొప్ప పండుగ అని శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ తెలిపారు. ఉగాది పర్వదినం, తెలుగు గొప్పతనాన్ని ఆయన వివరించారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఉగాది షడ్రుచుల్లో సమ్మిళితమై ఉంటాయని వెల్లడించారు. ప్రపంచ భాషలలో తెలుగుకు ఉన్న ప్రాముఖ్యత ఎనలేనిదని కొనియాడారు. ఈ సందర్భంగా శతావధానిని అతిథులు, సాక్షి ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. తెలుగు సాహిత్య సాంప్రదాయ వస్త్ర ప్రదర్శన పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకులు ఎం.సురేంద్రను సాక్షి జీఎం సత్కరించారు.

సాంస్కృతికం...నేత్రానందం...

సాక్షి ఉగాది వేడుకలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు నేత్రానందంగా సాగాయి. భరతనాట్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ నృత్యకారుడు చల్లా జగదీష్ ప్రదర్శించి తోడైమంగళం జయ జానకీ రమణ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. అలాగే అకార్డ్స్ స్కూల్ విద్యార్థుల ప్రణవాలయ పాహీ స్వాగత నృత్య రూపకం అలరించింది. జగదీష్ శిష్య బృందం నేహా, భవజ్ఞ, కీర్తనలు ప్రదర్శించిన మల్లారి నృత్యం మైమరిపింపజేసింది. ప్రదర్శకులకు అతిథుల చేతులుగా జ్ఞాపికలు అందజేశారు.

ఒడుదుడుకులు తప్పవు..

విశ్వావసు నామ సంవత్సరంలో అన్ని రంగాలు ఒడుదుడుకులు ఎదుర్కొకతప్పవని ఆగమ శాస్త్ర పండితులు డాక్టర్ పీటీజీ రంగ రామానుజాచార్యులు వెల్లడించారు. ముందుగా ఆయన ఉగాది పచ్చడి విశేషాలను సభికులకు వివరిస్తూ సుగంధ ద్రవ్యాన్ని శాస్త్రోక్తంగా తయారు చేయించి అందిరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరు మంచికి వెళ్లినా చెడు ఎదుర్కోక తప్పని పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు. ఈ క్రమంలోనే విశ్వావసు నామ సంవత్సర రాశిఫలాలను వివరించారు. అనంతరం ఆయనను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

కనువిందుగా సంప్రదాయ వస్త్ర ప్రదర్శన

విద్యార్థినీ విద్యార్థులు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రదారణతో పోటీల్లో పాల్గొన్నారు. వివిధ దేవతామూర్తులు, పంచకట్టు, పట్టుచీరలు వంటి అలంకరణలో వేదికపై ప్రదర్శన ఇచ్చారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మరో ఐదుమందికి ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఈ వేడుకలను తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులతో ఆడిటోరియం కిక్కిరిసింది. వచ్చిన ప్రతి వ్యక్తికి ఉగాది పచ్చడితో పాటు, అల్పాహారంతో కూడిన గిఫ్ట్ బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం డీజీఎం శ్రీనివాస్, బీఎం సత్యేంద్రబాబు, ప్రొడక్షన్ ఆర్‌ఎం రాజా, ఏడీవీటీ మేనేజర్ బి.వెంకటరత్నం, ఎడిషన్ ఇన్‌చార్జి ఎండ్లూరి మోహన్, బ్యూరో ఇన్‌చార్జి తిరుమల రవిరెడ్డి, సర్క్యులేషన్ ఏజీఎం రమణ పాల్గొన్నారు.


ఉగాది పచ్చడి తయారు చేస్తున్న మహిళలు


భరతనాట్య ప్రదర్శనలో జగదీష్ శిష్య బృందం


సంప్రదాయ వస్త్ర ప్రదర్శనలో విద్యార్థులు

కిడ్నాపర్ల కోసం ముమ్మర గాలింపు

తిరుపతి క్రైమ్: నగరంలో సంచలనం రేపిన కిడ్నాప్ కేసును పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముమ్మరంగా గాలిస్తున్నారు. కిడ్నాప్‌నకు గురైన రాజేష్ కుటుంబీకులు సుమతి, విజయలక్ష్మి, యోషిత, జోషిత కోసం పలు ప్రాంతాల్లో వెతుకుతున్నారు. కిడ్నాపర్ భార్గవ్ తదితరుల కోసం తనిఖీలు చేపట్టారు. అయితే పోలీసులకు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు కూడా లభించకపోవడం గమనార్హం. కిడ్నాప్‌నకు గురైన వ్యక్తులు బెంగళూరులో ఉన్నట్లుగా భార్గవ్ ఇంతకు ముందే రాజేష్‌కు తెలపడంతో ఆయా ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు.

వెంటాడుతున్న నిపుణుల కొరత


మాట్లాడుతున్న జడ్జి రామగోపాల్

తిరుపతి కల్చరల్ : భారతదేశంలో నిపుణుల కొరత తీవ్రంగా ఉందని పలువురు వక్తలు తెలిపారు. యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అత్యాధునిక శిక్షణా కేంద్రాన్ని జిల్లా ఐదో అడిషనల్ కోర్టు జడ్జి జి.రామగోపాల్ ప్రారంభించారు. ఐటీఐ డైరెక్టర్ కెఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో ఒక ఇంజినీరు ఉంటే పది మంది డిప్లొమా హోల్డర్లు, ఒక డిప్లొమా హోల్డర్‌కు పది మంది ఐటీఐ నిపుణులు ఉండాలని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. ఇంజినీర్లు ఎక్కువ మంది వస్తున్నారని, వారి కింద పని చేయాల్సిన నైపుణ్యం కల వారు తక్కువ మంది వున్నారని తెలిపారు. భవిష్యత్తులో కృత్రిమ మేధ ప్రజల భవిష్యత్తును శాసించనుందని వివరించారు. తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రం స్థానంలో విద్యా, వైద్య కేంద్రంగాను, ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌గాను అభివృద్ధి చెందుతోందన్నారు. ఇది వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి తోడ్పడుతుందన్నారు. జడ్జి రామగోపాల్ మాట్లాడుతూ తాను ఏలూరు జైలును సందర్శించిన సమయంలో ఆశ్చర్యకరమైన విషయాలు తన దృష్టికి వచ్చాయని గుర్తు చేసుకున్నారు. చిన్న చిన్న నేరాలు చేసి నేర ప్రవృత్తికి అలవాటు పడిన 200 మందిని పరిశీలించినట్టు తెలిపారు. వారిలో బీటెక్, పీజీ, డిగ్రీ స్థాయికి మించి చదివిన వారే అత్యధికులని వివరించారు. చదివిన చదువులకు ఉపాధికి సంబంధం లేని పరిస్థితి ఏర్పడడంతోనే అలాంటి దురదృష్టకర పరిణామం కొనసాగుతోందన్నారు. గ్రామాల నుంచి వలసలు పెరిగాయని గుర్తు చేశారు. కంప్యూటర్ ల్యాబ్‌లో అన్ని రకాల కోర్సులను నామమాత్రపు రుసుముతో నేర్పించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తుడా మాజీ కార్యదర్శి వెంకటనారాయణ, సోషల్ వేల్ఫేర్ విభాగం డెప్యూటీ డైరెక్టర్ టి.విక్రమ్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది పురుషోత్తం రెడ్డి, ఉపవిద్యాశాఖాధికారి బాలాజీ, ఏంబీ విజ్ఞాన కేంద్రం విజయవాడ బాధ్యుడు మురళీకృష్ణ, ఎంఈవో హేమాలిని, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, ముఖేష్, టెంకాయల దామోదారం, లక్ష్మీనారాయణ, తహసున్నీసా, రెడ్డెప్ప, రఫీ, గురునాథం, మునిరాజు పాల్గొన్నారు.

చెట్టుతో చేటు!


డీపీటీఓ కార్యాలయంపైకి వచ్చిన చెట్టుకొమ్మలు

తిరుపతి అర్బన్ : జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ)కార్యాలయానికి ఓ చెట్టుతో ముప్పు పొంచి ఉందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. తిరుపతిలోని డీపీటీవో కార్యాలయం వద్ద ఓ పెద్ద వృక్షం ఉంది. ఆ చెట్టు కొమ్మలు కార్యాలయ గోడపై పడుతున్నాయి. దీంతో గోడ పలుచోట్ల పగుళ్లిచ్చింది. ఈ క్రమంలో కార్యాలయ గోడ పడిపోతుందనే భయం ఉద్యోగులను వేధిస్తోంది. ఎప్పుడైనా పెనుగాలులకు చెట్టు కూలిపోతే పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందని సిబ్బంది వాపోతున్నారు. చెట్టు కొమ్మలను తొలగిస్తే సమస్య పరిష్కారమవుతుందని వెల్లడిస్తున్నారు.

శుభకరం.. విశ్వావసు సంవత్సరం

- శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు
- శాస్త్రోక్తంగా పంచాంగ పఠనం
- అలరించిన కవి సమ్మేళనం


పంచాంగం శ్రవణం నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణశర్మ


ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: విశ్వావసు నామ సంవత్సరంలో అన్నీ శుభసూచనలే దర్శనమిస్తున్నాయని శ్రీకాళహస్తీశ్వరాలయ ఆస్థాన సిద్ధాంతి కరణం లక్ష్మీ సత్యనారాయణశర్మ తెలిపారు. ఆదివారం ముక్కంటి ఆలయంలో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. స్వామివారి సన్నిధి వద్ద పంచాంగ పఠనం చేపట్టారు. రాశుల వారీగా ఫలాలను వివరించారు.ఈ క్రమంలోనే ఊంజల్‌సేవా మండపం వద్ద రాత్రి నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. అవధాని మేడసాని మోహన్ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో రాశులపై దుష్ప్రభావం లేదన్నారు. శ్రీకాళహస్తిలో పుట్టినవారికి దక్షిణామూర్తి, జ్ఞానాంబ, శివయ్య అనుగ్రహంతో ఏ కష్టాలైన ఎదుర్కోగలిగిన శక్తి ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు కవులందరూ కవిత్వాలను, భావాలను వినిపించి ప్రేక్షకులను ఉత్తేజపరిచారు. అనంతరం కవులను ఆలయ అధికారులు ఘనంగా సత్కరించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి పాల్గొన్నారు.

ఆదిదంపతుల విహారం

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారు ఉగాది పర్వదినం పురస్కరించుకుని పురవిహారం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని అలంకారం మండపంలో స్వామి అమ్మవార్లకు వివిధ కాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధి వద్ద విశేష పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ఆదిదంపతులు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

తుమ్మలగుంటలో వైభవంగా ఉగాది ఆస్థానం

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా వేకువజామున సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేపట్టారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు అందించారు. ఈ క్రమంలోనే వేదపండితులు . శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేపట్టారు.


విశేషాలంకరణలో కల్యాణ వెంకన్న